క్లుప్తంగా

రైస్‌మిల్లు తొలగించాలని వినతి



మాట్లాడుతున్న బాధితులు

తంగళ్లపల్లి: తాడూర్ చౌరస్తాకు కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కన నివాసాల మధ్యలో ఉన్న రైస్‌మిల్లును తొలగించాలని కాలనీవాసులు శనివారం తహసీల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. మహాలక్ష్మీ ట్రేడర్స్ పేరుతో నిర్వహిస్తున్న పెద్ద రైస్‌మిల్లు మూలంగా 150 కుటుంబాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మిల్లు నుంచి వచ్చే దుమ్ముతో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని, ఇంట్లోకి లక్క, తెల్ల పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు గజభీంకార్ సంతోష్, ఎస్.బాలరాజు, పాపయ్య, రాజయ్య, రాజు, హన్మంతు, మోహన్, వెంకయ్య, శ్రీను, రాకేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



కప్ అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తంగళ్లపల్లి: యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ మండల నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాళ్లపేటలో నిర్వహించిన క్రీడాపోటీల్లో క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేసి మాట్లాడారు. పోలీస్ జట్టుకు చెందిన కార్తీక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కప్ అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, నరేష్, పరశురాం, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రగతి పనుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

గంభీరావుపేట: మల్లారెడ్డిపేట గ్రామాన్ని ఎంపీడీవో రాజేందర్ శనివారం సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, పల్లె ప్రకృతి వనం, హరితహారం వంటి పనులను పరిశీలించారు.

లబ్ధిదారుకు కారు అందజేత



గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లి గ్రామానికి చెందిన మేడ రాజశేఖర్‌కు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా షిఫ్ట్ కారు మంజూరైంది. కారును శనివారం టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు చేతుల మీదుగా లబ్ధిదారుడికి అందించారు. బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ రాజవీర్, సీఈవో రాజిరెడ్డి, సొసైటీ మేనేజర్ సత్యంరావు, సిబ్బంది విష్ణు, మహేందర్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించండి



మాట్లాడుతున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించాలని, గ్రామంలో భూమిపూజలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపే సమయంలో సంబంధిత ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారమివ్వాలని ఎంపీపీ పడిగెల మానస సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా గ్రామస్తులకు అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు మాత్రమేనని, వారిని గౌరవించాలన్నారు. పంచాయతీలో ఎంపీటీసీకి ప్రత్యేకంగా చైర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీడీవో బి.వెంకటేశ్వర్లు, ఎంపీవో ఆరీఫ్, సూపరింటెండెంట్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

ఎల్లారెడ్డిపేట: కోరుట్లపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్త బర్కూటి ఎల్లవ్వ రోడ్డు ప్రమాదంలో 18 నెలల క్రితం మరణించింది. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2లక్షల బీమా చెక్కును శనివారం మృతురాలి భర్త మల్లయ్య, కుమారుడు సతీశ్‌లకు కేకే మహేందర్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. నాయకులు చక్రధర్‌రెడ్డి, మేడిపల్లి దేవానందం, మేడిపల్లి రవీందర్, గూడ నారాయణరెడ్డి, పద్మారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

అదిరెన్.. డెకరేషన్..

- ఇంటికి స్మార్ట్ ఫర్నిచర్ అందాలు
- పెరుగుతున్న గృహోపకరణాల డిమాండ్
- వివిధ వెరైటీల్లో లభిస్తున్న ఫర్నిచర్
- బ్రాండెడ్.. లోకల్ బ్రాండ్ల వస్తువుల అమ్మకాలు

సండే స్పెషల్







సిరిసిల్లటౌన్: ఇల్లు కట్టగానే సరిపోతుందా. అందరు నచ్చేలా.. చూసేవారు మెచ్చేలా ఉండాలని కోరుకుటున్నారు నేటి తరం ప్రజలు. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు వారికున్న ఆర్థిక స్థోమత ప్రకారం ఇంటిని అలంకరిస్తున్నారు. ఇందుకు మార్కెట్లో ఎన్నెన్నో వైరైటీల్లో స్మార్ట్ ఫర్నిచర్ అందుబాటులో ఉంది. చూడగానే ఆకట్టుకుంటున్న అందమైన ఫర్నిచర్‌పై ఈవారం సండే స్పెషల్ స్టోరీ మీకోసం..

ఫర్నిచర్ ధరలు

సోఫాసెట్స్: రూ.13వేలు–50వేలు
బెడ్స్: రూ.5వేలు–35వేలు
మ్యాట్రెస్: రూ.2,500–80,000
టీపాయ్స్: రూ.1,200–20,000
చైర్స్: రూ.3,000–15,000
డ్రెస్సింగ్ టేబుల్స్: రూ.5,000–20,000
డైనింగ్ టేబుల్: రూ.10,000–50,000
హ్యాంగింగ్ చైర్స్: రూ.5,000–20,000

లోకల్ టూ బ్రాండెడ్..

ఆర్థిక స్థోమతను బట్టి ప్రజలు లోకల్ బ్రాండ్ మొదలుకొని బ్రాండెడ్ ఫర్నిచర్‌ను వినియోగిస్తున్నారు. నీల్‌కమల్, గోద్రెజ్, కర్లాన్, స్లీప్‌వెల్, సెంచురీ లభ్యమౌతుండగా.. ఆన్‌లైన్‌లో ఐకియా, వుడెన్ స్ట్రీట్, గోద్రెజ్, దురియన్, నటుజీ, స్టాన్లీ, బ్లూవుడ్ తదితర కంపెనీల్లో ఫర్నీచర్ కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు వేములవాడలో పదుల సంఖ్యలో ఫర్నీచర్ స్టాల్స్ ఉన్నాయి. కొందరు వ్యాపారులు స్థానికంగానే వుడ్, ప్లేవుడ్, వినీయర్ షీట్స్, టేకు, వివిధ వెరైటీల్లో వుడ్‌తో ఫర్నీచర్ తయారు చేస్తున్నారు. స్థానికుల బడ్జెట్‌కు అనుగుణంగా లోకల్ తయారీ ఫర్నీచర్ బ్రాండెడ్ ఫర్నీచర్‌కు ఇంచుమించుగా తయారు చేస్తూ బిజినెస్ పెంచుకుంటున్నారు. సులభ వాయిదాల్లో కూడా లభ్యమౌతుండటంతో ప్రజలు రాజీ పడకుండా నచ్చిన మోడల్స్‌లో గృహోపకరణాలు కొంటూ ఇంటిని అందంగా అలంకరిస్తున్నారు.



సమ్‌థింగ్ స్పెషల్‌గా..

ఆధునిక యుగంలో ఇంటిని ఏవిధంగా తీసిపోకుండా డెకరేషన్ చేస్తున్నారు. అందరి ఇళ్లలో మాదిరిగా కాకుండా తమ ఇంటికి ప్రత్యేకత ఉండాలన్న తపనను కనబరుస్తున్నారు. ఇంట్లోని హాల్, బెడ్రూం, లివింగ్ రూమ్, కిచెన్, బాత్‌రూమ్స్‌లో ప్రత్యేక ఫర్నిచర్‌ను వినియోగిస్తున్నారు. కొత్తకొత్త స్టైల్స్‌లో బెడ్స్, మ్యాట్రెస్, చైర్స్, అల్మారాస్, డైనింగ్ టేబుల్స్, సోఫాసెట్స్, టీపాయ్, డ్రెస్సింగ్ టేబుల్స్, ఆఫీస్ చైర్స్, విజిటర్స్ చైర్స్, బాస్ చైర్, ఆఫీస్ టేబుల్, కంప్యూటర్ టేబుల్, బుక్ ర్యాక్స్, కబ్‌బోర్డులు, బార్ స్టూల్స్, హ్యాంగింగ్ చైర్, రోలింగ్ చైర్స్ మార్కెట్లో లభ్యమైతున్నాయి. గతంలో వడ్రంగిల చేత చేయించుకునే వాళ్లు.. ఇప్పుడు ఫ్యాషన్ డిజైన్లలో రెడీమేడ్ ఫర్నీచర్‌ను వినియోగిస్తున్నారు.



అందంగా.. ఆహ్లాదంగా..

అందమైన ఫర్నిచర్‌తో ఆహ్లాదంగా గడపడానికి ఇష్టపడుతున్నారు. వచ్చిపోయే అతిథులు మెచ్చడమే కాకుండా తాము కంఫర్ట్‌గా ఫీలయ్యే మోడల్స్‌లో ఫర్నీచర్‌ను తయారు చేయించుకుంటున్నారు. హాల్‌లో ముఖ్యంగా సోఫాసెట్స్‌తో పాటు హాయిగా విశ్రాంతి పొందడానికి రెక్లైనర్స్‌ను ఇష్టపడుతున్నారు. లోకల్ బ్రాండ్‌ను ఇష్టపడేవారు స్థానికంగా తయారు చేయించుకుంటుండగా.. బ్రాండెడ్ ఇష్టపడేవారు ఆర్డర్లపై, మరికొందరు మాల్స్, ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. తినడానికి డైనింగ్ టేబుల్, అలంకారానికి డ్రెస్సింగ్ టేబుల్స్, టీవీ చూస్తూ గంటల తరబడి గడపడానికి సోఫాసెట్స్, రెక్లేయ్‌నర్స్, పెద్దలకైతే రోలింగ్ చైర్స్, పిల్లలు, మహిళలు ఇష్టపడే హ్యాంగింగ్ చైర్స్‌ను వినియోగిస్తున్నారు.

రిలాక్స్ కోసం..



ఇంట్లోని ఫర్నిచర్ అందం కోసమే కాకుండా విధులు నిర్వహించుకొని వచ్చి రిలాక్సవడం కోసం ఉపయోగపడుతున్నాయి. మార్కెట్లో ఎన్నో వెరైటీల్లో ఫర్నీచర్.. అది కూడా లోకల్‌గా దొరకడం సంతోషదాయకం. ఇల్లు అందంగా కనిపించడంలో మనం వినియోగించే ఫర్నీచరే అనడంలో సందేహం లేదు.

– నాగుల లక్ష్మి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు

పదిహేనేళ్లుగా..



పదిహేనేళ్లుగా ఇక్కడ ఫర్నిచర్ బిజినెస్ చేస్తున్నాం. మొదట్లో కేవలం బెడ్స్, టేబుల్స్, మ్యాట్రెస్, కూలర్స్ ఎక్కువగా అమ్మేవాళ్లం. ఇప్పుడు ట్రెండ్ మారింది. బెడ్రూం మొదలుకొని ఇంటి ఆవరణలో ఉంచుకునే షూ స్టాండ్ వరకు వెరైటీల్లో వస్తువులు కోరుతున్నారు. ఆర్డర్లను బట్టి బ్రాండెడ్ ఫర్నిచర్‌ను డెలివరీ చేస్తాం. స్మార్ట్ ప్రైస్‌కే ఫర్నీచర్ అందిస్తున్నాం.

– గౌస్, ఫర్నిచర్ తయారీదారుడు



కశ్మీర్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి, కౌన్సిలర్లు

కేసీఆర్ జన్మదిన వేడుకలు

సిరిసిల్ల/వేములవాడ/వేములవాడఅర్బన్/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/కోనరావుపేట/తంగళ్లపల్లి/చందుర్తి: మాజీ ముఖ్యమంత్రి, కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: మండెపల్లి వృద్ధాశ్రమంలో..



వేములవాడ: రాజన్న గుడి ముందు కేక్ కట్ చేస్తున్న చల్మెడ లక్ష్మినర్సింహారావు, నాయకులు

వాలీబాల్ విజేత బోయినపల్లి

బోయినపల్లి: కొదురుపాక గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీల్లో బోయినపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. కొదురుపాక జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీల్లో 14 జట్లు పాల్గొన్నాయి. విజేతలను నిర్వాహకులు అభినందించి సాయంత్రం బహుమతులు అందజేశారు.

కేసీఆర్ బాగుండాలని పాదయాత్ర

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఎంపీటీసీ గీతాంజలి వేములవాడ రాజన్న ఆలయానికి పాదయాత్ర చేపట్టింది. రాచర్ల బొప్పాపూర్ ఎంపీటీసీ ఇల్లెందుల గీతాంజలి శనివారం బొప్పాపూర్ నుంచి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం వరకు పాదయాత్ర చేసింది.

మాజీ సీఎంను కలిసిన ఎంపీపీ

ముస్తాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంపీపీ జనగామ శరత్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఫాంహౌస్‌లో శనివారం కేసీఆర్‌ను కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

గురుకుల విద్యార్థుల వీడ్కోలు హంగామా

ముస్తాబాద్: ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో వీడ్కోలు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్ సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉదయ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అజ్మత్‌ను కలిసిన నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఎంపికైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు హన్మండ్లుగౌడ్, ఎల్లే బాలకృష్ణ శనివారం హైదరాబాద్‌లో కలిశారు. శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలను పరిశీలించిన డీఈవో

ఎల్లారెడ్డిపేట: అగ్రహారం ప్రాథమిక పాఠశాలను డీఈవో రమేశ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో పలు సబ్జెక్టులను చదివించారు. సెక్టోరియల్ అధికారి శైలజ, ఉపాధ్యాయుడు నరేశ్ ఉన్నారు.

సిరిసిల్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరుశాతాన్ని పెంచేందుకు, స్పాట్ ఫీడింగ్ ఇచ్చేందుకు రాగి లడ్డూలను అందిస్తున్నారు. జిల్లా కేంద్రంలో రాగి లడ్డూల పంపిణీకి శనివారం శ్రీకారం చుట్టారు. మిషన్ వాత్సల్య నిధులతో అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్ పిల్లలకు రాగి లడ్డూలు ఇవ్వడంతో హాజరు మెరుగుపడుతున్నట్లు ఐసీడీఎస్ అధికారులు గుర్తించారు. గర్భిణులు, బాలింతలకు రాగిలడ్డూలను స్పాట్ ఫీడింగ్‌గా ఇవ్వడంతో పోషకాహారం లభిస్తుందని, మంచి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం కోరారు. రగుడు, చంద్రంపేటలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు.

గంభీరావుపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు శనివారం రాగిలడ్డూలు పంపిణీ చేశారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా కేంద్రాలకు వచ్చే చిన్నారులు, కిషోర బాలికలు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం కోసం రాగి లడ్డూలందిస్తున్నారు. ఐసీడీఎస్ పరిధిలోని గంభీరావుపేట, లింగన్నపేట సెక్టార్ల సూపర్‌వైజర్లు సంతోష, పద్మజ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, భాగ్యమ్మ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో అంగన్‌వాడీ చిన్నారులకు శనివారం రాగి లడ్డూల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారుల్లో రక్తహీనత నివారించేందుకు ప్రతి శనివారం రాగి లడ్డూలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కోనరావుపేట టీచర్ మంచికట్ల నర్మద, ఆయా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పొలాస విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఎల్లారెడ్డిపేట: రాచర్ల గొల్లపల్లిలో పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. సామాజిక వనరులు, ప్రిఫరెన్స్ ర్యాంకింగ్, సమస్యల చెట్టు, కాలానుగుణ పంటల మార్పిడి వంటి అంశాలపై వ్యవసాయ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులతో మాట్లాడారు. ముగ్గులతో చిత్రాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ పాశం సరోజన, వ్యవసాయాధికారి భూంరెడ్డి, ఏఈవో ముకుందం, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జబ్బర్, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని బయో, ఫిజికల్ సైన్స్ స్టేట్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయిలో 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ టాలెంట్ టెస్ట్‌లో నెహ్రూనగర్ జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు అరుకాల కావ్య, ఎక్కలదేవి అక్షర మండలస్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయులు ద్యావనపల్లి పరమేశ్, కోడం భారతి ప్రశంసించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

ఎల్లారెడ్డిపేట: బంజారాల ఆరాధ్య దైవ్యం సంత్ సేవాలాల్ మహరాజ్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేటలో శనివారం భోగ్‌బండార్ నిర్వహించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, గుగులోతు కళావతి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలి



- లంబాడీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌జాదవ్

కోనరావుపేట(వేములవాడ): సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని లంబాడీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌జాదవ్ పేర్కొన్నారు. కోనరావుపేటలో శనివారం సంత్ సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. బస్టాండ్ నుంచి శోభాయాత్రగా వచ్చి మహాభోగ్ భండార్ నిర్వహించారు. రాజ్‌కుమార్ జాదవ్ మాట్లాడుతూ కోనరావుపేటలో గిరిజన భవన్ కోసం రెండు గుంటల స్థలాన్ని కేటాయించాలని, ఠానూనాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ రమేశ్‌నాయక్, సిద్దార్థ జాదవ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సిరిసిల్ల డాక్టర్ సురేంద్రబాబు, కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్‌పాషా, గొట్టె రామచంద్రం, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: తప్పుడు కాగితాలు తయారుచేసి, సంతకాలు ఫోర్జరీ చేసి ఒకే భూమిని రెండుసార్లు విక్రయాలు చేసిన మోసం చేసిన సిరిగిరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన శిరిగిరి రమేశ్ సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి సురేష్‌కు సర్వే నంబర్ 112, 129 ముష్టిపల్లిలోని రెండు ప్లాట్స్(320 గజాలు)ను 2015, ఫిబ్రవరి 5న విక్రయించి, వేములవాడ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. శిరిగిరి రమేశ్ మళ్లీ తప్పుడు కాగితాలు తయారుచేసి, ఫోర్జరీ సంతకాలతో ప్లాట్ నంబర్ 16లోని 150 గజాల భూమిని తంగళ్లపల్లికి చెందిన తక్కల్ల అశోక్‌కు 2019, మే 24న సిరిసిల్ల ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేశాడు. ముందుగా భూమి కొన్న సిరిగిరి సురేష్ విక్రయదారుడైన రమేశ్ వద్దకి వెళ్లి తనకు 320 గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి, మళ్లీ తక్కల్ల అశోక్‌కు ఎలా విక్రయించావని నిలదీయడంతో తనకు రూ.80 వేలు ఇస్తే తిరిగి భూమి యథావిధిగా అప్పగిస్తానని రమేశ్, సురేశ్‌కు తెలిపాడు. అలా కాకుండా ఇదే విషయాన్ని మళ్లీ.. మళ్లీ అడిగితే చంపుతానని బెదిరించడంతో బాధితుడు సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మోసానికి పాల్పడిన రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు. సిరిగిరి రమేశ్ బాధితులు నిర్భయంగా సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సీఐ రఘుపతి కోరారు.

తాటి, ఈత చెట్లు దగ్ధం

బోయినపల్లి(చొప్పదండి): బూర్గుపల్లి గ్రామ పరిసరాల్లో పెద్దమొత్తంలో తాటి, ఈతచెట్లు దగ్ధమయినట్లు తెలిసింది. గ్రామంలో ఓ చేలో పెద్దమొత్తంలో తాటి, ఈత చెట్లున్నాయి. తాటి, ఈత చెట్లు కూలిన అనంతరం దగ్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సిరిసిల్ల ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా.. గ్రామంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.



దగ్ధమైన తాటిచెట్లు

కళాశాలలో మినీ ఇంపాక్ట్ ప్రోగ్రాం



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మినీ ఇంపాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సైకాలజిస్ట్ అనిత, ఇంపాక్ట్ ప్రోగ్రాం డైరెక్టర్లు సాయిబాబు, సుధాకర్, ఆవుల తిరుపతి, ట్రైనర్లు రమాదేవి, పోచవ్వ, మదనమోహనచారి, బాలకిషన్, సురేష్ విద్యార్థులకు కెరియర్ డెవలప్మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.రజిని, వైస్ ప్రిన్సిపాల్ సుధాసింధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన సర్వే బిల్లు ఆమోదంపై హర్షం

రుద్రంగి: బీసీ కుల గణన సర్వే బిల్లు ఆమోదంపై బీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం రుద్రంగి మండల కేంద్రంలో సమావేశమై ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు గండి నారాయణ, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, తర్రె లింగం, బీసీ సంఘాల నాయకులు గంగాధర్, ఇప్ప మహేశ్, ధర్న మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో రాగి లడ్డూలు



రాగి లడ్డూలు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

సబ్బండవర్గాల సంక్షేమమే లక్ష్యం

సిరిసిల్లటౌన్: సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీలో బీసీ కులగణన తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గాంధీచౌక్‌లో సంబరాలు నిర్వహించారు. చరిత్రలో మొదటిసారిగా బీసీ కులగణనకు కాంగ్రెస్ చర్యలు చేపట్టడం సంతోషదాయకమన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర సర్కారు అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, పీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, ఆకునూరి బాలరాజు, గడ్డం నర్సయ్య, కాముని వనిత, వెల్ముల స్వరూప, కల్లూరి చందన, సూర దేవరాజు, గోలి వెంకటరమణ, గోనె ఎల్లప్ప, రాపెల్లి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

కోనరావుపేట: గ్రామాల్లో ప్లాస్టిక్ నిర్మూలనకు కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో జోగం రాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బోయినపల్లి(చొప్పదండి): వెంకట్రావుపల్లి గ్రామంలో ఫోర్‌లేన్ రోడ్డు నిర్మాణంలో పూడుకుపోయిన మురుగు కాల్వలను శనివారం డీపీవో వీరబుచ్చయ్య పరిశీలించారు. గ్రామ పరిసరాల్లో చేపడుతున్న ఫోర్‌లేన్ రహదారి నిర్మాణంతో మట్టి పడి మురుగు కాల్వలు పూడుకుపోయాయని ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూడుకుపోయిన మురుగు కాల్వలు, చెడిపోయిన తాగునీటి పైప్‌లైన్ వ్యవస్థను డీపీవో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆలయానికి విరాళం అందజేత

కోనరావుపేట: మల్కపేట గ్రామంలో పోచమ్మ ఆలయానికి పాకాల శ్రీనివాస్‌గౌడ్ రూ.10వేల విరాళాన్ని అందజేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నారు. ఈనెల 21 నుంచి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించనున్నారు.